సాక్షి
కుమురంభీం

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



పంచతత్వానికి ప్రజాదరణ
ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం కోసం పంచతత్వ ఆక్యూప్రెషర్ పార్కు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే తొలి పార్క్ కావడం విశేషం. 8లో▸



మామిడి మార్కెట్ లేనట్లేనా ?
మామిడికి వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీతోపాటు అమెరికా, అస్ట్రేలియా దేశాలకు మామిడి ఎగుమతి అవుతోంది. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.2 /24.7
పగటిపూట వాతావరణం వేడిగా ఉంటుంది. బయటకు వెళ్లకుండా ఉంటే మంచిది. రాత్రి వేళలో చల్లగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది: 6:29	సోమ : 4:46

పత్తి రైతుపై విత్తన భారం



పత్తిలో అరక తోలుతున్న రైతులు (ఫైల్)

- పత్తి విత్తనాల ధర పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు
- రైతులపై రూ.1.81 కోట్ల ఆర్థిక భారం
- ఖర్చులకు తగ్గట్టు పత్తి ధర పెంచాలని రైతుల డిమాండ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి లేక ఇబ్బంది పడుతున్న పత్తి రైతులపై విత్తనాల ధర పెరుగుదల రూపంలో ఆర్థిక భారం మరింతగా పడనుంది. సీజనల్ ప్రారంభంలో కోటి ఆశలతో సాగు చేస్తున్న పత్తి రైతుపై గడిచిన కొన్ని సంవత్సరాలుగా ప్రకృతి తన ప్రతాపాన్ని చూపుతుండడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రతియేటా సాగులో నష్టాలే ఎదురవుతున్నా... ఈసారైనా దేవుడు కరుణించకపోతాడా అనుకుంటూ ముందుకు సాగుతున్నాడు. ఈసారి సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం పత్తి విత్తనాల ధరను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో రైతులపై అదనపు భారం పడనుంది.

జిల్లాలో 3.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు..
జిల్లాలోని 15 మండలాల పరిధిలోని రైతులు పత్తినే ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. జిల్లాలో ఆశించిన స్థాయిలో సాగునీటి వసతులు లేక రైతులంతా వర్షాధార పంటల వైపే మొగ్గుచూపుతున్నారు. అందులో ఎక్కువగా పత్తిసాగు చేస్తున్నారు. గత సీజనల్‌లో జిల్లా వ్యాప్తంగా దాదాపు 3.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. సీజన్ ప్రారంభం నుంచే కురిసిన అధిక వర్షాలతో మొలక దశలోనే వందలాది ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. వర్షాలతో పంటలను కాపాడుకునేందుకు ఎరువులు, రసాయనిక మందుల పిచికారి, కలుపు నివారణకు పెట్టుబడులు పెరిగాయి. పత్తి కొనుగోళ్ల సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.9వేల వరకు పలికిన ధర క్రమంగా తగ్గుతూ రావటంతో రైతులు పత్తి ధర విషయంలో నష్టపోయారు. అయినప్పటికీ కోటి ఆశలతో పత్తి సాగు కోసం రైతులు సిద్ధం అవుతుండగా ప్రభుత్వం పత్తి విత్తనాల ధర పెంచడంతో సీజన్‌కు ముందే రైతులకు ఎదురుదెబ్బ తగిలింది.

జిల్లా రైతులపై 1.81 కోట్ల అదనపు భారం..
కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ప్యాకెట్ ధరను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయటంతో జిల్లా రైతులపై కోట్ల రూపాయల్లో అదనపు భారం పడనుంది. జిల్లాలోని రైతులు సాధారణ పత్తి సాగులో 450 గ్రాముల బరువు కలిగిన పత్తి విత్తనాల ప్యాకెట్‌ను ఎకరానికి ఒకటి చొప్పున, సాలు పద్ధతిలో ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున విత్తుతారు. ఈ లెక్కన జిల్లాలో ప్రతీ సంవత్సరం సుమారు 4.2 లక్షల వరకు పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెంచడంతో గతంలో రూ.810 ఉన్న ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.53కు చేరింది. దీంతో జిల్లాలో పత్తి సాగు చేసే రైతులపై సుమారు రూ.1.81 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. ఈ ఏడాది అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర సైతం దక్కకపోవటంతో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలకు పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు మీదపడ్డాయి. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం విత్తనాల ధర పెంచడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అన్న చందంగా మారింది అన్నదాతల పరిస్థితి.

పెంచిన ధరను తగ్గించాలి



కేంద్ర ప్రభుత్వం పెంచిన పత్తి విత్తనాల ధరను వెంటనే తగ్గించాలి. గత సంవత్సరం అధిక వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సరైన దిగుబడి రాకపోవటంతో అప్పులు మీదపడ్డాయి. సీజనల్ ప్రారంభంలో ఉన్న ధర ప్రస్తుతం లేకపోవటంతో తక్కువ ధరకే పంటను అమ్మి ఆర్థికంగా నష్టపోయారు. ఈ సమయంలో ధరలు తగ్గించి రైతులను ఆదుకోవాల్సింది పోయి విత్తనాల ధరలు పెంచి రైతులను ఆర్థిక భారాన్ని మోపటం సరికాదు.

– రాయిల్ల నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

పత్తికి రూ.15వేలు ఇవ్వాలి



రోజురోజుకు పెరుగుతున్న ఎరువులు, విత్తనాల ధరలకు అనుగుణంగా పత్తి క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లించాలి. పెరిగిన కూలి, ఇతర ఖర్చులకు అనుగుణంగా పత్తి ధర పెరగటం లేదు. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరిగి ప్రతిసారి నష్టాలను చూడాల్సి వస్తోంది. ఈసారి పత్తి విత్తనాల ధరలను కూడా పెంచారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పత్తి ధర కూడా పెంచాలి. అప్పుడే రైతుకు న్యాయం జరుగుతుంది.

– రాజు నాయక్, రైతు గోలేటి

భయం వీడి పరీక్షలకు
హాజరవ్వాలి

- డీఎస్పీ శ్రీనివాస్

వాంకిడి: పదో తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలకు హాజరవ్వాలని ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. శనివారం వాంకిడి పోలీస్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. విద్యార్థులు పదో తరగతిలో ఉన్నతమైన ఫలితాలను సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. పిల్లల విజయాన్ని తల్లిదండ్రులు వారి కష్టానికి ఫలితంగా భావిస్తారని వారి మాటలను జవదాటకుండా మెలగాలని సూచించారు. అనంతరం 300 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. సీఐ శ్రీనివాస్, మండల విద్యాధికారి మనుకుమార్, ఎస్సై సాగర్, ఉపాధ్యాయులు ఉషన్న, చైతన్యకుమార్, సీఆర్పీ సందీప్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఆర్ట్ టీచర్ దేవాజీతో కలిసి విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరిలో ముంబై నుంచి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ది డ్రీమ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో గురుకుల విద్యార్థులు రితిక్‌బాబు, సాయినాథ్ డ్రాయింగ్ కలరింగ్ విభాగంలో 4వ స్థానంలో నిలిచారు. అలాగే హర్షిత్, మిత్ర, రిషిత్, వినయ్, మహేష్, సృజన్ కలరింగ్ హ్యాండ్ రైటింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అధ్యాపకులు నరేందర్, ఉపేందర్, సైదుల్ ఉన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతి భద్రతల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30వ వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ కె.సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 30 యాక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

హనుమాన్ జయంతి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఆలయ గౌరవాధ్యక్షుడు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి ఆవిష్కరించారు. జయంతి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని కోరారు. అంతకు ముందు ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురుస్వాములు, స్వాములు, భక్తులతో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ హనుమాన్ జయంతి, శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చేలా చూడాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ, కమిటీ సభ్యులు పిన్నా వివేక్, వెంకటేశ్వర్లు, ఎకిరాల శ్రీనివాస్, మురళీగౌడ్, తుపాకి వెంకన్న, ప్రకాష్‌గౌడ్, రూప్‌నార్ రమేష్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 58, 59 కింద ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువు నెల రోజులు పొడగించినట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు, దీంతో పాటు క్రమబద్ధీకరణ వర్తించే కటాఫ్ తేదీని 2014 జూన్ 2 నుంచి 2020 జూన్ వరకు పొడగించినట్లు తెలిపారు. దరఖాస్తు దారులు పాస్‌ఫొటో, రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్రాపర్టీ టాక్స్ రసీదు, విద్యుత్ బిల్లు, నీటి బిల్లు, ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విజ్ఞానవంతులు కావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు విజ్ఞాన వంతులు కావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ వెంకటేశ్ అన్నారు. శనివారం మండలంలోని బాబాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో భయం లేకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. పరీక్షలకు ప్రణాళికబద్ధంగా సన్నద్ధమై మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. క్రమశిక్షణ, ఏకగ్రతతో చదివితే భవిష్యత్‌లో మంచి ప్రయోజనాలు కావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు రాజీవ్‌రెడ్డి, విద్యాసాగర్, వెంకటేశ్వర్ ఉన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీనివాస్‌యాదవ్



వీసీ సమావేశంలో కలెక్టర్ బొర్కడె హేమంత్

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2వ విడత గొర్రెల పంపిణీ, కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, జీవో నం. 58,59,76,118, పోడు భూములు, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం పథకం వంటి పలు అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక సంక్షేమాభివృద్ధి పథకాలను అమలు చేస్తోందన్నారు. గొర్రెల పంపిణీ పథకం 2వ విడత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, రాష్ట్రంలోని గొల్లకుర్మలకు, యాదవులకు 75 శాతం రాయితీతో గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా 7.31 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి 50శాతం మందికి మొదటి విడతలో పెండింగ్‌లోని 3.38 లక్షల మందికి గొర్రెల యూనిట్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గొర్రెల కొనుగోలుకు సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, కలెక్టర్ల ఆధ్వర్యంలో పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కలెక్టర్ బొర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ మాట్లాడుతూ కంటివెలుగు 2వ విడతలో భాగంగా జిల్లాలో 26 బృందాలను నియమించి శిబిరాలను విజయవంతంగా కొనసాగుతోందని, అద్దాలు అవసరమున్నవారికి ఆర్డర్‌పై అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో 2 కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రెండు పడకల గదల ఇండ్ల కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారిని ఎంపిక చేసి పంపిణీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, ఆర్డీఓ రాజేశ్వర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, డీపీఆర్వో కృష్ణమూర్తి, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజన్న, ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో డిజిటల్ సేవలు

- డీలర్ల ఆదాయం పెంచేందుకు ప్రత్యామ్నాయ చర్యలు
- మెరుగుపడనున్న పౌర సేవలు



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: రేషన్ దుకాణాల్లో ఇప్పటి వరకు ప్రభుత్వం నిరుపేదలకు బియ్యం పంపిణీ చేస్తుండగా, ఇక నుంచి డిజిటల్ సేవలు అందనున్నాయి. డీలర్లకు ప్రభుత్వం చెల్లించే కమీషన్ సరిపోవడం లేదు. వీరికి ఆదాయం పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రేషన్ దుకాణాల్లో పౌర సేవలు విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకు సేవలు, పోస్టల్ సేవలతో పాటు వివిధ రకాల సేవలు అందించేందుకు పూనుకుంది. ఈ క్రమంలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ రేషన్ దుకాణాల డీలర్లతో శనివారం అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి తారామణి జిల్లాలోని అన్ని మండలాల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కామన్‌సర్వీస్ సెంటర్(సీఎస్సీ) ఈ గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వారి ప్రతినిధి డీలర్లకు సీఎస్సీ సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో 300 రేషన్ దుకాణాలున్నాయి. ఆసక్తి గల డీలర్లు దరఖాస్తు చేసుకుంటే ప్రైవేటు ఏజెన్సీ వారికి డిజిటల్ లావాదేవీలపై శిక్షణ ఇస్తారు. బ్యాంకులు లేని గ్రామీణ ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాల్లో డిజిటల్ సేవలు మెరుగుపడనున్నాయి.

బ్యాంకు సేవలు..
రేషన్ దుకాణాల్లో డిజిటల్ సేవలతో పాటు అన్ని బ్యాంకుల్లో డబ్బులు జమ చేయడంతో పాటు విత్‌డ్రా చేసుకోవచ్చు. రైతుబంధు, స్కాలర్‌షిప్, కేసీఆర్ కిట్, పీఎం కిసాన్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు. దీంతో పాటు వాహనాల ఇన్సూరెన్స్, విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను, నీటి పన్ను, ఫోన్ బిల్లుతో పాటు 'మీ సేవా' సర్వీసులు, ఇతర డిజిటల్ లావాదేవీలకు అవకాశం ఉంటుంది. 0–10 సంవత్సరాల వారికి ఇక్కడి నుంచే ఆధార్ కార్డు జారీ చేయవచ్చు. ఉపాధి హామీ డబ్బులు, ఆసరా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉంటుంది.

డీలర్లకు అవగాహన..
జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం డిజిటల్ లావాదేవీలు, బ్యాంకు సేవల వినియోగంపై అవగాహన కల్పించారు. డీలర్లు వారి మొబైల్ ఫోన్‌లోనే ఐపీపీబీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సేవలు అందించనున్నారు. దీనిపై పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

అభివృద్ధి పేరిట ఇష్టారాజ్యం..

ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉండే మారుమూల ఆదివాసీ గ్రామాల్లో ఎవరో ఒకరు ఆకస్మాత్తుగా వచ్చి మీ ప్రాంతంలో ఓ పరిశ్రమ ఏర్పాటు చేస్తాము. అందులో గ్రామస్తులకు మొదటి ప్రాధాన్యత కల్పించి ఉద్యోగాలు ఇస్తాము. గ్రామంలోని ఆలయాలు, రహదారులు, మంచినీటి బోర్లు, వంతెనలు నిర్మించి గ్రామాన్ని పూర్తిగా అభివృద్ధి పథంలో నిలుపుతామంటే ఎవరైనా కాదనలేరు.. కానీ ఓ బడా పారిశ్రామిక వేత్త గ్రామాభివృద్ధి పేరుతో కంకర పరిశ్రమను ఏర్పాటు చేసి హామీలన్నీ గాలికి వదిలేశారు. అంతే కాదండోయ్ గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన ట్యాక్స్‌ను సైతం ఎగ్గొట్టేలా వ్యవహరిస్తున్నాడు. ఈ పరిస్థితి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం దొడ్డిగూడ గ్రామంలోనిది.



దొడ్డిగూడలో నిర్వహిస్తున్న కంకర పరిశ్రమ

- ఆశచూపి దొడ్డిగూడలో కంకర క్రషర్ ఏర్పాటు
- ఏడాది పూర్తైనా గ్రామం వైపు తిరిగిచూడని యాజమాన్యం
- పంచాయతీకి చెల్లించాల్సిన ట్యాక్స్‌కు ఎగనామం
- నోటీసులు పంపినా మారని తీరు
- క్రషర్ ఏర్పాటుతో నష్టపోతున్న ప్రజలు
- నిలదీస్తే కేసుల పేరుతో బెదిరింపులు.?
- పట్టని ఉన్నతాధికారులు



క్రషర్‌కు పంపిన నోటీస్



రాసిచ్చిన హామీ పత్రం

వాంకిడి: మంచిర్యాల నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన గోయెగాం వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల జాతీయ రహదారి–363 నిర్మాణానికి భారీగా కంకర అవసరం ఉండడంతో సదరు గుత్తేదారు వాంకిడి మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాలపై కన్నేశాడు. డొంగర్‌గాం గ్రామ శివారులోని ఓ గుట్టను అన్నిశాఖల అనుమతులతో లీజుకు తీసుకుని క్వారీ ఏర్పాటు చేసుకున్నాడు. నాలుగు వరుసల రహదారి నిర్మిస్తున్న యాజమాన్యం సిర్పూర్ (యూ)కు చెందిన అరుణ్‌కుమార్ అనే ఆదివాసీ పేరున అనుమతులు తీసుకుని దొడ్డిగూడ గ్రామంలోని 10 ఎకరాల్లో క్రషర్‌ను ఏర్పాటు చేసింది. గ్రామస్తులు తమకు నష్టం వాటిల్లుతుందని అభ్యంతరం వ్యక్తం చేయడంతో గ్రామంలోని ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని గ్రామపంచాయతీకి హామీ పత్రం రాసి ఇచ్చి పరిశ్రమ ప్రారంభించింది. రెండేళ్లు పూర్తి కావస్తున్నా గ్రామంలో ఇప్పటి వరకు అభివృద్ధి పనులు చేపట్టలేదు.

బోరుకే పరిమితం...
కంకర పరిశ్రమ స్థాపించే సమయంలో దొడ్డిగూడ గ్రామంలో 300 మీటర్ల సీసీ రోడ్డు, భీమన్న ఆలయంలో షెడ్డు నిర్మాణం, మంచి నీటి బోరు, ఎనగొందిలో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించి ఇస్తామని దుక్రే అరుణ్‌కుమార్ పేరున హామీ పత్రం రాసి ఇచ్చారు. అదేవిధంగా ఎనగొంది గ్రామానికి మధ్యలోని వాగుపై వంతెన నిర్మాణం చేపడతామని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటి వరకు ఎనగొందిలో బోరు తప్ప ఎలాంటి పనులు చేపట్టలేదు.

జీపీ ట్యాక్స్ చెల్లించలేదు..
ఏడాది క్రితం ప్రారంభించిన కంకర పరిశ్రమకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్యాక్స్ రూ.1.15 లక్షల పన్ను ఇప్పటికీ చెల్లించలేదు. పంచాయతీ అధికారులు ఫిబ్రవరి 25న ట్యాక్స్ చెల్లించాలని నోటీసులు పంపించారు. కాని స్పందన రాలేదు. దీని గడువు జూన్‌తో ముగియనుంది. 2023–24 ఏడాదికి సంబంధించిన ట్యాక్స్ రూ.1.21 లక్షలు చెల్లించాలని నోటీస్ అందజేశారు. ప్రస్తుతం ట్యాక్స్ మొత్తం రూ.2.36 లక్షలు రావాల్సి ఉంది. అలాగే క్రషర్‌తో పంటలు చెడిపోతున్నాయని, రోడ్లు అధ్వానంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నిస్తే కేసుల పేరుతో భయపెడుతున్నారని ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు..
నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేపడుతున్న యాజమాని ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం జిల్లాలో అటవీశాఖ అనుమతులు రాక నాలుగైదు ఏళ్ల నుండి రహదారుల నిర్మాణాలు నిలిచి ఉన్నాయి. కానీ దొడ్డిగూడ, డొంగర్‌గాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్వారీ, కంకర క్రషర్‌లకు మాత్రం కొన్ని రోజుల వ్యవధిలోనే అనుమతులొచ్చాయి.

హామీలు గాలికొదిలేశారు...



మా గ్రామంలో కంకర క్రషర్ ఏర్పాటు చేసే సమయంలో కంపెనీ యాజమాన్యం గ్రామాభివృద్ధి చేస్తామని హామీ పత్రం రాసి ఇచ్చారు. కానీ నేటికీ ఒక్క బోరు తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. రేయింబవళ్లు భారీ వాహనాల రాకపోకలు, యంత్రాల శబ్ధాలతో నిద్రపట్టడం లేదు. దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు చొరవ తీసుకోవాలి.

–వడై బాజీరావు, గ్రామ పటేల్, దొడ్డిగూడ

ట్యాక్స్ చెల్లించడం లేదు..



గ్రామ పంచాయతీ చెల్లించాల్సిన ట్యాక్స్ చెల్లించడం లేదు. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను రావాలి. రెండేళ్లు కంకర క్రషర్ ఏర్పాటు చేస్తామని గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు ఇవ్వడం జరిగింది. వచ్చే జూన్ నెలతో రెండేళ్లు పూర్తవుతాయి. హామీ ప్రకారం పనులు చేయకపోతే క్రషర్ పనులు నిలిపివేస్తాం.

– మడావి లింగుబాయి, సర్పంచ్, దొడ్డిగూడ

తప్పకుండా వసూలు చేస్తాం..

గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన ట్యాక్స్ క్రషర్ యాజమాన్యం నుంచి తప్పకుండా వసూళ్లు చేస్తాం. ఇప్పటికే నోటీసులు పంపించడం జరిగింది. మరోసారి నోటీసు పంపిస్తాము. స్పందించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

–రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి


పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్లు

పంచతత్వానికి ప్రజాదరణ

- ఆదిలాబాద్‌లో ఆక్యుప్రెషర్ పార్కు
- నడకకు పలువురి ఆసక్తి

ఆదిలాబాద్: పట్టణ ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం కోసమే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్కులో పంచతత్వ ఆక్యుప్రెషర్ పార్కు ఏర్పాటు చేశారు. రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కులో 12 ఎంఎం, 4 ఎంఎం కంకర నల్ల రేగడి మట్టి, ఇసుక రేణువులు, గులకరాళ్లు నీటితో కూడిన వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశారు. ట్రాక్‌పై చెప్పులు లేకుండా నడవడం ద్వారా అన్ని అవయవాలకు రక్తప్రసరణ జరిగి శరీరంలోని నాడులన్నీ ఉత్తేజితమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇది ఉమ్మడి జిల్లాలోనే తొలి పార్క్ కావడం విశేషం. ఈ పార్క్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రజల తాకిడి ఎక్కువవుతోంది. పార్కు వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని వాకర్లు చెబుతున్నారు. వారి మాటల్లోనే తెలుసుకుందాం.

యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలి



పంచతత్వ పార్కును పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ప్రశాంతత ను చేకూరుస్తుంది. పార్కులో నడవడంతో శరీరానికి సరైన రక్తప్రసరణ జరిగి రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఇందులో నడిచిన అనంతరం యోగా చేస్తున్నాం. పార్కు పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలంలో గడ్డిని ఏర్పాటు చేస్తే యోగా చేసుకోవడానికి వీలవుతుంది.

– అనిత, శాంతినగర్, ఆదిలాబాద్

కొత్త అనుభూతి



ప్రతిరోజు నడిచే నడక కంటే ఇందులో నడవడం వల్ల కొత్త అనుభూతి కలుగుతుంది. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పంచతత్వ పార్కులను పట్టణంలో మరికొన్ని చోట్ల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– శివాజీ, ఆదిలాబాద్

నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



పార్కు నిర్వహణను మరింత పకడ్బందీగా చేపడితే వాకర్లు ఎక్కువ సంఖ్యలో రావడానికి అవకాశం ఉంటుంది. వాకింగ్ ట్రాక్‌లో నీటిని రోజు శుభ్రపరచి కొత్త నీటిని నింపితే బాగుంటుంది. రోజులుగా నీరు అలాగే నిల్వ ఉండడంతో అడుగు భాగంలో పాకురు ఏర్పడి జారిపడిపోయే అవకాశాలున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.

– మహేశ్, బ్రహ్మణ్‌వాడ, ఆదిలాబాద్

అవగాహన కల్పించాలి



నా కుమారుడితో కలిసి ఈ పార్కులో నడుస్తున్నా. థీమ్ పార్కు ఏర్పాటుతో ఆరోగ్యంపైన ప్రతి ఒక్కరికి శ్రద్ధ పెరుగుతుంది. నా కుమారుడికి వ్యాయామం గురించి అవగాహన కల్పించడమే కాకుండా స్వయంగా చేయిస్తున్నా. తల్లిదండ్రులు ఈ దిశగా ఆలోచించి పిల్లలకు అలవాటు చేయాలి.

– సంజీవ్, శాంతినగర్, ఆదిలాబాద్

ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి



గత మూడు నెలల నుంచి ప్రతిరోజు ఉదయం 5 నుంచి 10 రౌండ్లు వాకింగ్ చేస్తున్నా. ఈ పంచతత్వ పార్కును పంచభూతాలను థీమ్‌గా తీసుకుని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పంచ భూతాలే జీవ కోటి మనుగడకు ఆధారం. అటువంటి పార్కుకు వాకర్లు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఈ ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి చూపుతున్నారు.

– సతీశ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, ఆదిలాబాద్

క్లుప్తంగా

శ్రీరాంపూర్‌లో 102 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 102 శాతం సాధించినట్లు ఏరియా ఎస్ఓటు జీఎం త్యాగరాజు తెలిపారు. శనివారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యం 66.4 లక్షల టన్నులకు గాను 67.9 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. ఆర్కే 8 గని, ఎస్సార్పీ 3 గనులకు సంబంధించిన పర్యావరణ ఉల్లంఘన కింద ఈ నెల 11న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటి వరకు 3187 మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామని, 3680 మంది మెడికల్ ఇన్వాలిడేషన్ అయ్యారని తెలిపారు. మార్చి 29న శ్రీరాంపూర్ నుంచి 33225 టన్నుల బొగ్గు రవాణా చేసిన రికార్డు నెలకొల్పామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

లక్సెట్టిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన రాజేందర్ (26) మృతిచెందాడు. శుక్రవారం రాత్రి దండేపల్లి మండలం చింతపల్లికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


చిందరవందరంగా బీరువాలోని దుస్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి స్టేషన్‌రోడ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ ఎస్సై సంతోష్ కథనం ప్రకారం.. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికురాలు జాగిర్తి మమత గతనెల 30న ఇంటికి తాళం వేసి అవసరం రీత్యా కొత్తగూడెం వెళ్లింది. తిరిగి శనివారం ఉదయం ఇంటికి చేరుకోగా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. తలుపును తీయడానికి యత్నించగా లోపలి నుంచి గొళ్లెం వేసి ఉన్నట్లు గ్రహించింది. ఇంటి వెనుక వైపు నుంచి తలుపు తాళం తీసి లోనికి వెళ్లింది. బీరువాలో ఉన్న గ్రాము బంగారం, రూ.25 వేల నగదు, భూమి దస్త్రాలను ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలిని ఎస్సై సంతోష్ పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో పలువురికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో కోతుల బెడద పెరిగిపోయింది. గుంపులుగుంపులుగా ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలు, మహిళలు, పిల్లలపై దాడి చేస్తున్నాయి. తాజాగా శనివారం జిల్లా కేంద్రంలోని గుండి రహదారి సమీపంలోని ఆకుల యాదగిరిగౌడ్ కుమారుడు మైత్రేయ గౌడ్ ఇంటి ముందు నిలబడి ఉన్నారు. మూడు కోతులు వచ్చి దాడి చేశాయి. దీంతో వెన్ను భాగాన తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పంచాయతీ అధికారులు కోతుల బెడద నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


గాయం చూపుతున్న మైత్రేయగౌడ్

పెంబిలో..

పెంబి: మండల కేంద్రంలోని కొత్తగూడెంవాడలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీళ్లు పడుతున్న సమయంలో దావుల నర్సయ్యపై కోతుల గుంపు దాడి చేశాయి. ఇంటిపై నుంచి కిందికి దూకడంతో ఆయన కాలికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నర్సయ్యను పెంబి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా, నర్సయ్యపై కోతుల దాడికి ముందే వాటి బెడద నివారించాలని మండల కేంద్రానికి చెందిన పలువురు సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం


పల్లెం రాజలింగును సన్మానిస్తున్న డీసీపీ సుధీర్ రామ్

మంచిర్యాలటౌన్: గోవాలో గతనెల 24, 25, 26 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో 70 ప్లస్ విభాగంలో రాష్ట్రం తరపున ఆడి బ్రాంజ్ మెడల్ సాధించిన పల్లెం రాజలింగును శనివారం డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మందమర్రికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పల్లెం రాజలింగు రాష్ట్రం తరపున బ్యాడ్మింటన్ పోటీలకు వెళ్లి మెడల్ సాధించడం గర్వంగా ఉందన్నారు. సెప్టెంబర్‌లో కొరియాలో జరిగే మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు రాజలింగు అవకాశం వచ్చిందని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏసీపీ ఎడ్ల మహేశ్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వాసు, జాయింట్ సెక్రెటరీ రమేశ్‌రెడ్డి, మధు, కృష్ణ, హర్ష పాల్గొన్నారు.

కలప తరలిస్తున్న కారు పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని కవ్వాల్ నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న కారును శనివారం పట్టుకున్నారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హాఫీజొద్దీన్ తెలిపిన వివరాలు.. పక్కా సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా కారులో రెండు కలప దుంగలు ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ పారిపోయాడు. కలపతో సహా కారును సీజ్ చేసి డివిజన్ కేంద్రానికి తరలించామన్నారు. దీని విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు'

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం నిర్వహించిన వివిధ సంఘాల అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామ స్థాయి నుంచే విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 5న నిర్వహించే చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కార్ల వెంకటేశ్వర్లు(56) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఇంటర్మీడియెట్ చివరి పరీక్ష విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో మంచిర్యాల శివారు గద్దెరాగడిలోని ఇంటికి వెళ్లాడు. ఆయన భార్య బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు శ్రీలత ఇంటికి వచ్చి చూసేసరికి పడిపోయి ఉన్నాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం స్వస్థలం కాగజ్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.


వెంకటేశ్వర్లు (ఫైల్)

సేఫ్టీ మేనేజ్‌మెంట్ యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్ష

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ యాక్షన్ ప్లాన్ అమలుపై ఉద్యోగులు, అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్‌తోపాటు డీజీఎం సేఫ్టీ జీఎస్ గోపాల్‌రాజ్, రామ్‌నాథన్ పాల్గొన్నారు. శాఖలవారీగా ఏరియా యాజమాన్యం అవలంబిస్తున్న రక్షణ చర్యల వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్పొరేట్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా సేఫ్టీ జీఎం మాట్లాడుతూ ఉద్యోగులందరూ రక్షణ సూత్రాలు పాటించి ప్రమాదరహిత సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో ఏరియా జీఎం దేవేందర్, ఎస్‌వోటూజీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, మేనేజర్ ప్రవీణ్‌ఫటింగ్, పీఈ రాజాజీ, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు వెంకటేశం, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సంక్షేమాధికారి వేణు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాన్‌ఆనంద్

గనుల్లో నాసిరకం మెటీరియల్

- హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: ఎస్సార్పీ–1 గనితోపాటు చాలా గనుల్లో కంపెనీ మెటీరియల్ నాసిరకంగా ఉంటున్నాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కోల్ కట్టర్లు ఉల్లుకోసే రాడ్లు పూర్తిగా నాసిరకంగా ఉంటున్నాయని అన్నారు. డ్రిల్ రాడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చివరికి కార్మికులకు ఇచ్చే బూట్లు నాణ్యత లోపించిందన్నారు. యాక్టింగ్ చేస్తున్న మేషన్, సాండ్ మిక్సింగ్ కోన్ ఆపరేటర్, టబ్బు రిపేర్ మజ్దూర్ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్ని సమస్యలు ఉన్నా కూడా టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నేతలు అధికారులను ప్రశ్నించకుండా వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు రాయలింగు, దుర్గం లక్ష్మణ్, వెంకటస్వామి, నామాల శ్రీనివాస్, మీస కొమురయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రూ.కోటి బీమా కోసం కృషి

- సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్, పా) ఎన్.బలరాం
- రెస్క్యూ మృతులకు బీమా చెక్కులు పంపిణీ

శ్రీరాంపూర్: ఉద్యోగులు ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబానికి రూ.కోటి బీమా డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని సింగరేణి డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎన్.బలరాం అన్నారు. గత వర్షాకాలంలో దహెగాం వరదల్లో బాలింతను కాపాడడానికి వెళ్లి మృతిచెందిన రెస్క్యూ సభ్యులు అంబాల రాము, చిలుక సతీశ్ కుటుంబ సభ్యులకు శనివారం ఆర్కే 5గనిపై బీమా డబ్బులు అందజేశారు. రాము భార్య స్పందనకు రూ.78 లక్షలు, సతీశ్ భార్య మమత రూ.32 లక్షల చెక్కును అందించారు. ఇదే గనికి చెంది, ఇతర కారణాలతో మృతిచెందిన కార్మికుడు అచ్చె మొగిలి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కంపెనీ అండగా ఉండడం కోసం బ్యాంకర్లతో సంప్రదించి ఉద్యోగులందరికీ కార్పొరేట్ సాలరీ అకౌంట్లను తెరిచి వారికి రూ.లక్షల్లో బీమా ఇప్పిస్తున్నట్లు తెలిపారు.


రాము కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న డైరెక్టర్ బలరాం

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

నస్పూర్ కాలనీ, కృష్ణాకాలనీ వాసుల కోసం కృష్ణాకాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను డైరెక్టర్ బలరాం ప్రారంభించారు. ఆర్కే 5 గనిపై వనంలో మొక్కలు నాటారు. జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ అకౌంట్స్ సెక్షన్‌లో లక్ష్మీపూజలో పాల్గొన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, ఎస్ఓటు జీఎం త్యాగరాజు, యూనియన్ బ్యాంక్ రీజియన్ అధికారి అరుణ్‌కుమార్, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు(పర్సనల్), శివరావు(సివిల్), చంద్రశేఖర్‌రెడ్డి(వర్క్‌షాప్), చిరంజీవి(ఐఈడీ)పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి సాధనకు కృషి చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గత ఆర్థిక సంవత్సరంలో ఏరియా కార్మికులు సాధించిన ఉత్పత్తిని స్ఫూర్తిగా తీసుకుని 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియాకు 36లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 29.2 లక్షల టన్నులతో 81 శాతం ఉత్పత్తి నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గోలేటి, ఎంవీకే ఓసీపీల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వోటు జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీవైపీఎం తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

వివాహిత ఆత్మహత్య

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన మురికి కళావతి(19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన మురికి మల్లేష్‌తో గత సంవత్సరం కళావతికి వివాహం జరిగింది. నెల రోజులుగా తల్లిగారి ఇంటికి వచ్చి ఉంటోంది. కాపురానికి వెళ్లనని తల్లిదండ్రులకు చెబుతూ ఉండేది. మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఈరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమిని ఎస్సై వెంకటేష్ తెలిపారు.


కళావతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

చికిత్స పొందుతూ వ్యక్తి..

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రవణ్(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గత నెల 26న బంధువుల వివాహానికి వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. గుర్తుతెలియని క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


శ్రవణ్ మృతదేహం

వివాహిత..

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన వివాహిత స్వప్న (28) చికిత్స పొందుతూ చనిపోయింది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం.. గత నెల 30న గ్రామానికి చెందిన మరో మహిళతో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి దూషించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన స్వప్న శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగింది. కుటుంబీకులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం చనిపోయింది. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


స్వప్న (ఫైల్)

సమస్యలపై డైరెక్టర్‌కు వినతిపత్రం

మందమర్రిరూరల్: సింగరేణిలో సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి డైరెక్టర్(పా) బలరాంనాయక్‌కు వినతిపత్రం అందించారు. శనివారం మందమర్రికి వచ్చిన డైరెక్టర్ ఏరియాలోని కేకే–5 గని సమీపంలోని మంకీ ఫుడ్ కోర్టును సందర్శించి మొక్కల ఎదుగుదలపై గని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీబీజీకేఎస్ నాయకులు డైరెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించి వినతిపత్రం అందించారు. ఆర్కే ఓసీని మందమర్రి భవిష్యత్ కోసం విస్తరించాలని, ఉద్యోగులకు నాణ్యమైన పనిముట్లు, బూట్లు అందించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఏరియా బ్రాంచ్ సెక్రెటరీ సత్యనారాయణ ఏరియాలో హెచ్‌ఆర్ఏ చెల్లించడం లేదని తదితర సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు

ఎస్అండ్‌పీసీ సిబ్బందిని నియమించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ఎస్అండ్‌పీసీ సిబ్బందిని నియమించాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం దేవేందర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా సెక్యూరిటీగార్డుల నియామకం లేకపోవడంతో సిబ్బంది కొరత సమస్యతో దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. పనిచేస్తున్న సిబ్బంది పైనే తీవ్ర పనిభారం పడుతోందని దాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్అండ్‌పీసీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్లను వెంటనే ఎస్అండ్‌పీసీలు పదోన్నతులు కల్పించాలన్నారు. ఉత్పత్తికి విఘాతం కలగకుండా గోలేటి సీహెచ్‌పీలో లారీల ఇన్ ఔట్‌లు వేసేందుకు ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించాలన్నారు. ఫిట్ కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఎండీ వశీం, శ్రీనివాస్, రమేశ్, గోపాలకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జీఎంకు వినతిపత్రం అందిస్తున్న హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజాబాబు

సీఓఈలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో శనివారం జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించారు. నెహ్రూ యవకేంద్ర, జిల్లా యువజన అధికారి సుశీల్‌బాద్ మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నైబర్ హుడ్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జీ 20 శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతుందని వివరించారు. విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అనంతరం యూత్‌పార్లమెంట్ నిర్వహించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై చర్చలో విద్యార్థి, యువజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గజ్జెల్లి మోహన్, సీఓఈ అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌వైకే అధికారి సుశీల్‌బాద్